క్లుప్తంగా

ఆకట్టుకున్న మా ఎగ్జిబిషన్



మా ఎగ్జిబిషన్ అండ్ సేల్స్‌లో కొనుగోలుదారుల సందడి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలను మా ఎగ్జిబిషన్ అండ్ సేల్ ఆకట్టుకుంది. బుధవారం ఎగ్జిబిషన్ నిర్వాహకులు కడప నగరం ప్రకాశ్‌నగర్‌లో గల తమ ఎగ్జిబిషన్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. 92.5 ప్యూర్ సిల్వర్ జ్యువెలరీ, ప్యూర్ బెనారస్ పట్టు, వెంకటగిరి పట్టు, కంచి పట్టు, ప్యూర్ జ్యామ్‌దాని శారీస్, ఫ్యాన్సీ శారీస్, జ్యామ్‌దాని డ్రస్ మెటీరియల్, బెడ్‌షీట్స్, దివాన సెట్స్, ఫ్యాబ్రిక్స్ తమ ప్రత్యేకతలన్నారు. ప్రజల ఆదరణకు మరోమారు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని వివరించారు. భవిష్యత్తులో కూడా మరింత మెరుగైన వస్త్రాలు, ఆభరణాలతో కూడిన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామని వారు వివరించారు.

ఫుట్‌బాల్‌లో కర్నూలు జట్టు విజయం



విజయం సాధించిన కర్నూలు జట్టు

కడప కార్పొరేషన్: విద్యుత్ సంస్థలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఆసక్తికరంగా జరుగుతున్నాయి. బుధవారం సీకేదిన్నె పోలీస్‌స్టేషన్ ప్రక్కనున్న మైదానంలో జరిగిన ఫుట్‌బాల్ ఫైనల్ మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. ఇందులో 2-0 తేడాతో కర్నూలు జట్టు విజయం సాధించింది. ఏపీ ట్రాన్స్ కో చీఫ్ ఇంజినీర్ క్రిష్ణకుమార్, జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, స్పోర్ట్స్ సెక్రటరీ వీరాంజనేయులు, మస్తాన్, కల్చరల్ సెక్రటరీ వీరభద్రయ్యలు మ్యాచ్‌ను పర్యవేక్షించారు.

స్తంభించిన ట్రాఫిక్



నడిరోడ్డుపై నిలిచిపోయిన వాహనదారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలోని బీకేఎం స్ట్రీట్‌లో బుధవారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ప్రాంతంలో సుమారు అరగంటకు పైగా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వాహనదారులు అటు ముందుకు వెళ్లలేక, ఇటు వెనక్కి రాలేక ఉండిపోయారు. ముఖ్యంగా మహిళల సమస్యలు వర్ణణాతీతంగా మారాయి. అత్యవసర పనుల మీద బయటికి వచ్చిన వారు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాల్సిన ట్రాఫిక్ పోలీసుల పనితీరుపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని నగర వాసులు పేర్కొన్నారు.

10న పుస్తకాల ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్ : అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కడప జిల్లా అధ్యక్షుడు వైవీయూ ప్రొఫెసర్ డా. ఎన్.ఈశ్వర రెడ్డి రచించిన రెండు పుస్తకాల ఆవిష్కరణ సభ కడప సిపి బ్రౌన్ గ్రంథాలయంలో ఈనెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు తెలిపారు. నిత్య బాలింత (కవిత్వ సంపుటి) సమాజహితం- సాహిత్య మతం (సాహిత్య విమర్శా వ్యాస సంపుటి)గ్రంథాల ఆవిష్కరణ సభకు దూర ప్రాంతాల నుండి ప్రఖ్యాత సాహితీవేత్తలు రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వికే రెడ్డి అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథిగా ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యం. దొరస్వామి, గౌరవ అతిథులుగా విజయవాడ అడిషనల్ ఎస్పీ లోసారి సుధాకర్, యోగి వేమన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ హాజరవుతారన్నారు.

విద్యా శాఖ ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలి

కమలాపురం : పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు తప్ప ఇతరులకు ప్రవేశం లేదని విద్యా శాఖ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాఘవ, సాదిక్‌లు డిమాండ్ చేశారు. బుధవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యా శాఖ జారీ చేసిన ఉత్తర్వులు కార్పొరేట్ విద్య వ్యాపారులకు అనుకూలంగా ఉంటాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో ఏ సంఘటనలు జరిగినా కూడా బయటకు పొక్క కుండా ఉండేందుకే ఈ ఉత్తర్వులు ప్రభుత్వం జారీ చేసిందని వారు మండిపడ్డారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఏ కష్టం వచ్చినా తల్లిదండ్రుల కన్నా ముందుగా వెళ్లేది విద్యార్థి సంఘాల నాయకులేనని వారు స్పష్టం చేశారు. ఏ సంఘటనలు జరిగినా కప్పి పుచ్చుకోవడం కోసమే ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసిందని, తక్షణం వాటిని వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వైభవంగా బ్రహ్మంగారి మాస కల్యాణోత్సవం



కల్యాణానికి హాజరైన భక్తులు



స్వామివారి మాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బ్రహ్మంగారిమఠం : శ్రీమద్విరాట్‌పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబల మాస కల్యాణ మహోత్సం బుధవారం బి.మఠంలో ఘనంగా నిర్వహించారు.

శ్రీమాతాగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణానికి మహిళా భక్తులు అధికంగా పాల్గొన్నారు. దేవస్థానం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో మేనేజర్ ఈశ్వరాచారి నిర్వహణలో మఠం ఆస్థాన పూజారులు ఇడమకంటి జనార్దనాచార్యులు కల్యాణం నిర్వహించారు. పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వెంకటాద్రిస్వామి, వీభద్రయ్యస్వామి, బ్రహ్మంయ్యస్వామి దంపతులు పాల్గొన్నారు. కల్యాణంను తిలకించేందుకు తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామి, ప్రొద్దుటూరుకు చెంది గవల స్వామి కృష్ణమాచారి, ప్రొద్దుటూరు, దువ్వూరు, మైదుకూరు, బ్రహ్మంగారిమఠం నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కళ్యాణం ఉభయధాతలతోపాటు, మాస కళ్యాణంకు రూ.1లక్ష విరాలు ఇచ్చినదాతలు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి ఓ సాధనం



బహుమతులు అందుకున్న విజేతలను అభినందిస్తున్న అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి ఒక శక్తివంతమైన సాధనమని ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీం బాషా అన్నారు. సమాచార హక్కు చట్టం-2005 ఏర్పాటై 20 ఏళ్ల పూర్తి అవుతున్న సందర్భంగా బుధవారం ఆర్.టి.ఐ మీద జోనల్ (కడప కర్నూలు చిత్తూరు అనంతపురం) స్థాయి పోటీలు కడపలోని ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో (స్వయం ప్రతిపత్తి) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీం బాషా మాట్లాడుతూ విద్యార్థులు సమాచార హక్కు చట్టం గురించి పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని రీజినల్ జాయింట్ డైరెక్టర్ డా. డి. నాగలింగ రెడ్డి మార్గదర్శకత్వంలో నిర్వహించామని తెలిపారు. విజేతలు రాష్ట్రస్థాయిలో ఈనెల 11వ తేదీన విజయవాడలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

పోటీలలో విజేతలు..

వ్యాసరచన : ఓమేశ్వరి వాణి, కె.టి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాయదుర్గం.

వక్తృత్వం : ఎ. మదిహా, ఎస్ ఎస్ పి ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హిందూపురం

వాదన (డిబేట్) జట్టు : ఎస్. అకిఫా బటోల్, షేక్ జేబా, ఎస్‌కె ఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల, కడప.

క్విజ్ జట్టు : వై. పూజిత, బి. సాలమ్మ, ఎం. కీర్తి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పులివెందుల.

ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులను నోడల్ రిసోర్స్ సెంటర్ ప్రిన్సిపాళ్లు, కళాశాల అధ్యాపక బృందం ప్రశంసా పత్రం, మొమెంటోలు అందజేసి అభినందించారు.

కాన్వకేషన్ నిర్వహించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : యోగివేమన యూనివర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలల విద్యార్థులకు కాన్వకేషన్ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. బుధవారం నగరంలో ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప యోగి వేమన యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలలో చదివిన విద్యార్థులు రెండు సంవత్సరాలుగా కాన్వకేషన్ నిర్వహణకు నిరీక్షిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మోహన్, నగర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం

చింతకొమ్మదిన్నె : స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం చింతకొమ్మదిన్నెలోని మండల రెవెన్యూ కార్యాలయం, మండల ఆరోగ్య కేంద్రం, మోడల్ స్కూలు, కోదండరామాలయం పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను, ప్లాస్టిక్ కవర్లను తొలగించడంతోపాటు అక్కడ సమీప ప్రాంతంలో ఉన్న గ్రామీణ ప్రజలకు పరిసరాలు-పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ రోనాల్డ్, మండల అధికారులు కళాశాల హెచ్ఎస్ విభాగాధిపతి డాక్టర్ కేఎస్ శశికుమార్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ టి.శంకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వల్లూరు : కడప-తాడిపత్రి ప్రధాన రహదారి వాహిద్ నగర్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. ఖాజీపేట మండలం అప్పనపల్లెకు చెందిన చౌడయ్య ఎర్రగుంట్లలో జరిగిన ఓ వివాహ వేడుకలో పాల్గొని ద్విచక్ర వాహనంలో కడప వైపుకు ప్రయాణిస్తూ వాహిద్ నగర్ వద్దరాగా కమలాపురం వైపుకు వస్తున్న ఆర్‌టీసీ బస్సు వెనుక భాగంలో ఢీ కొట్టాడు. దీంతో కిందపడ్డ అతడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స కోసం అతన్ని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ట

మైదుకూరు : మండలంలోని వనిపెంట మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో బుధవారం సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. సరస్వతీ దేవి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా గణపతి హోమం, రుద్రహోమం, చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ నిర్మల, రిటైర్డ్ ప్రిన్సిపాల్, విగ్రహ దాత శ్రీనివాసులు, శివ బాలిరెడ్డి, సూర్యనారాయణ, జెడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

వల్లూరు : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా విద్యా శాఖాధికారి షంసుద్దీన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సాంబారు పలుచగా వుండడాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల మెనూ మేరకు మంచి భోజనాన్ని అందించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణను పరిశీలించి, ఆవరణను పరిశుభ్రంగా వుంచాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలోని దెబ్బతిన్న ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించి దాన్ని తొలగించడానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

తల్లిపాలు అమృతంతో సమానం



తల్లిపాల ప్రాధాన్యతను తెలియజేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తల్లిపాలు అమృతంతో సమానమని గుర్తిస్తూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు అందేలా చూడాలని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. బుధవారం కడప నగరం విద్యుత్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మూడు రోజుల్లో వచ్చే పాలను ముర్రుపాలు అంటారని, ప్రసవించిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టడం వల్ల శిశు మరణాలు తగ్గించవచ్చన్నారు. ముర్రుపాలలో విటమిన్ ఏ, సీ, డీ, ఇ, కే ప్రొటీన్స్, మినరల్స్ అధికంగా ఉంటాయన్నారు. అలాగే తల్లి పాలివ్వడం తల్లిబిడ్డ మధ్య బలమైన భావోద్వేగ సంబంధాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ వాణిశ్రీ, ఏసీడీపీఓ శోభారాణి, సూపర్‌వైజర్ మాబుచాంద్, ఎంఎస్‌కే మల్లీశ్వరితోపాటు ఇతర అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, బిడ్డల తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితం బుగ్గిపాలు




డ్రగ్స్‌కు సంబంధించిన కరపత్రాలను చూపుతున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : డ్రగ్స్‌తో జీవితం బుగ్గిపాలు అవుతుందని, డ్రగ్‌కు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండి డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని ఈగల్ అధికారులు సూచించారు. బుధవారం కడప మండలం ఆలంఖాన్‌పల్లి జిల్లా పరిషత్తు హైస్కూల్లో గంజాయి, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర డ్రగ్స్ కట్టడి చేయడం కోసం ఈగల్ పేరుతో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్టాలు, ఎన్‌డీపీఎస్ చట్టంలోని కఠిన శిక్షల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలు, నివాస ప్రాంతాల సమీపంలో ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం, గంజాయి విక్రయాలు జరుగుతూ ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1972కు కాల్ చేసి సమాచారాన్ని తెలియ చేయాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాదక ద్రవ్యాల నివారణలో భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ మునిరత్నమ్మ, ఉపాధ్యాయులు, ఈగల్ క్లబ్ మెంబర్స్, నార్కోటిక్ సెల్ ఏఎస్ఐ మల్లయ్య, ఈగడ్ హెడ్ కానిస్టేబుల్ అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ప్రారంభించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు డా బీ ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ ద్వారా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెద్దలపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధపడుతూ ప్రైవేటు కోచింగ్ సెంటర్లకు వెళ్లే స్తోమత లేక ఇంటిదగ్గర చదివితే ఉద్యోగాలు వస్తాయని నమ్మకం లేక ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. వీరికి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ స్టడీ సర్కిల్ సెంటర్లను ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లా కేంద్రాల్లో ఉచిత శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్, జిల్లా నాయకులు మధు పాల్గొన్నారు.







పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో భాగంగా పులివెందుల మండలం కనుమపల్లెలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీ నాయకులు

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి అమానుషం



మాట్లాడుతున్న ఎస్. శివరామ్

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గుండాలు దాడి చేయడం అమానుషమని ఆ పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్. శివరామ్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజకీయాల్లో ప్రజాబలంతో గెలవాలి తప్ప దాడులు చేసి జనాలను భయభ్రాంతులకు గురిచేసి రిగ్గింగులకు పాల్పడి గెలవడం కాదన్నారు. గెలుపు అంటే ప్రజలతో ఎన్నుకోబడాలన్నారు. కూటమి నాయకులు, సీఎం చంద్రబాబు ప్రజలకు మేలు చేసి ఉంటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేయలేదు కాబట్టే దాడులకు పాల్పడుతున్నారన్నారు. సౌమ్యుడు, మృదుస్వభావి అయిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రాములపై దాడి చేయడం పిరికితనమన్నారు. టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి పులివెందులలో ఓడిపోతున్నాడనే బాధతోనే దాడులకు తెగబడుతున్నారన్నారు. నిజంగా ప్రజలకు తెలుగుదేశం ప్రభుత్వం న్యాయం చేసి ఉంటే ప్రజాబలంతో గెలవాలన్నారు. నల్లగుండ్లపల్లెలో వేరే వారి ఇంటికి వెళ్లిన నాయకులపైన దాడులు చేయించడం దారుణమన్నారు. టీడీపీ రౌడీలను, గుండాలను పోషిస్తుందనేందుకు ఇది నిదర్శనమన్నారు. ఇది ముమ్మాటికీ బీసీలపై రాజకీయ దాడిగా భావిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు నీచ సంస్కృతిని పక్కనపెట్టి ప్రజల ముందు ప్రజాబలంతో గెలవడానికి ప్రయత్నించాలన్నారు. ఇప్పటికైనా శాంతియుతమైన రాజకీయాలు చేయాలని కోరుతున్నామన్నారు.

దాడి పిరికిపంద చర్య..

శాసన మండలి సభ్యులు రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేల్పుల రాములపై దాడి చేయడం పిరికిపంద చర్య అని ఆ పార్టీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ అన్నారు. బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలలో ఎవరైనా పోటీ చేయొచ్చని, ప్రచారం స్వేచ్ఛగా నిర్వహించుకోవచ్చన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రతి ఒక్కరికీ వాక్‌స్వాతంత్ర్యం ఉందన్నారు. తమకు నచ్చిన అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేసుకునే హక్కు ఉందన్నారు. వేల్పుల రాము పులివెందులలోని మారుమూల ప్రాంతమైన వేల్పులను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. ఆయనకు వస్తున్న ప్రజాదరణ ఓర్చుకోలేక ప్రత్యక్ష దాడి చేయడం దారుణమన్నారు. వేల్పుల రాము, రమేష్ యాదవ్‌లపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఓటమి భయంతోనే ఈ దాడికి పాల్పడ్డారన్నారు. ఎలక్షన్ కమిషన్ జోక్యం చేసుకుని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైవీయూలో స్నాతకోత్సవం నిర్వహించాలి



వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన వర్సిటీ స్నాతకోత్సవం త్వరగా నిర్వహించాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేస్, కార్యదర్శి అక్షయ్ కుమార్‌రెడ్డిలు కోరారు. ఈ విషయమై బుధవారం రిజిస్ట్రార్ పుత్తా పద్మను వైవీయూలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా వైవీయూలో కాన్వొకేషన్ నిర్వహించకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన కాన్వొకేషన్ నిర్వహించాలని కోరారు. అలాగే వర్సిటీలో వసతి గృహాల్లో వైఫై ఏర్పాటు చేయడంతోపాటు వసతులను మెరుగు పరచాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం!



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: రోడ్డు భద్రత చర్యల ఆంక్షలను జిల్లాలో మరింత కఠినతరం చేసి రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న రహదారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కఠినతరం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి వాహన ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. రియల్టర్లు, రాజకీయ ప్రమేయాలకు స్పందించకుండా రోడ్డు భద్రతా ఆంక్షలను పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో 108 వాహన సేవలు సకాలంలో అందేలా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్,సీట్ బెల్ట్ లేకుండా వాహనం నడపడం, పరిమితికి మించి ఆటోలు నడపడం, బస్సులు ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామగ్రి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవలసిందిగా రవాణ శాఖ అధికారులను ఆదేశించారు. గువ్వల చెరువు ఘాట్ రోడ్డు ప్రమాదాలపై టోల్ గేట్‌ల వద్ద కరపత్రాలు ముద్రించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గువ్వల చెరువు ఘాట్ దిగే మలుపు వద్ద రోడ్డును విస్తరించాలన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కమిటీ సభ్యులైన రోడ్ సేఫ్టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జి.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సాధికారత కోసమే మిషన్ శక్తి

కడప సెవెన్‌రోడ్స్: మహిళల భద్రత, సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం 'మిషన్ శక్తి' కార్యక్రమాన్ని ప్రారంభించిందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ లో మిషన్ శక్తి కార్యక్రమం అమలుపై నిర్వహించిన జిల్లా స్థాయి మిషన్ శక్తి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మిషన్ శక్తిలో 'సంబల్', 'సమర్థ్య' ఉప పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. 'సంబల్' పథకం మహిళల భద్రతకు, 'సమర్థ్య' పథకం మహిళల సాధికారత కోసం ఏర్పాటు చేసిందన్నారు. వన్ స్టాప్ సెంటర్ల ద్వారా చట్టపరమైన కౌన్సెలింగ్, మానసిక-సామాజిక కౌన్సెలింగులు అందించాలని.. అలాగే చైల్డ్ మ్యారేజ్ నిర్మూలనకు అవగాహన కల్పించాలన్నారు. 'మిషన్ శక్తి' లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద మొదటిసారి ప్రసవానికి 5వేలు రూపాయలు , రెండవ ప్రసవంలో ఆడపిల్ల జన్మిస్తే 6వేలు రూపాయలు అందిస్తోందని తెలిపారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ, మహిళా సాధికారిత అధికారి పి రమాదేవి, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డీఈవో శంషుద్దీన్,స్టెప్ సీఈవో సాయి గ్రేస్, సీపీవో హజరత్తయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను వేధించడం తగదు

పెండ్లిమర్రి : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను వేధించడం, అవినీతికి మారు పేరుగా నిలిచిన పెండ్లిమర్రి సెక్షన్ విద్యుత్ జూనియర్ ఇంజనీర్ శివకుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మిట్టమీదపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడలేని విధంగా పెండ్లిమర్రి సెక్షన్ జూనియర్ ఇంజనీర్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తిచడం, వేధింపులకు గురిచేయడం చేస్తున్నారన్నారు. ఏదైనా ఉద్యోగి తప్పుచేస్తే వారికి నోటీసులు ఇచ్చి వివరణ తీసుకొని వేతనాలు కట్ చేయాలి కాని జూనియర్ ఇంజనీర్ మాత్రం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నాడన్నారు. ఇప్పటికై న ఉన్నతాధికారులు స్పందించి ఇతనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.